# అదృశ్యహస్తం

-కె.వి.ప్రసాద్

"దేవుడుంటే నాకీ అన్యాయం ఎందుకు జరిగింది?" సుబ్బారావు ఆవేదన

ఎదురుగా వున్న అప్పారావు అదిరిపడ్డాడు. తత్తరపడ్డాడు.

"ఏం అన్యాయం?" అడిగాడు అప్పారావు.

"నాకు ప్రమోషన్ రాలేదు. నాకంటే జూనియర్లకు వచ్చింది. నాకంటే పనికిరాని వాళ్లకు వచ్చింది. నేను చేసిన పాపమేంటి? దేవుడు నన్ను ఎందుకు ప్రమోట్ చేయలేదు" సుబ్బారావు ప్రశ్నలు గుప్పించాడు. అప్పారావు, సుబ్బారావులు ఇద్దరూ ఒకే సంస్థలో పని చేస్తున్నారు. అప్పారావు, సుబ్బారావులు ఒకేసారి ఉద్యోగంలో చేరినా అప్పారావు పైపైకి ఎగబాకిపోయాడు. సుబ్బారావు అతని కంటే మూడు స్థాయిలు తక్కువలో ఉన్నాడు. ఈ సంవత్సరం కూడా సుబ్బారావుకు మేనేజిమెంటు మొండి చెయ్యి చూపింది. అతనికంటే అన్నిరకాలుగా క్రింది వారిని పదోన్నతులను చేసింది.

"సుబ్బారావు! నీకు ప్రమోషన్ ఎందుకు రాలేదో నీకు తెలియదు అంటే నమ్మేంత అమాయకుడిని కాదు. కారణం నువ్వే చెప్పు" అప్పారావు అడిగాడు.

"సోకాల్డు కాన్ఫిడెన్షియలు రిపోర్ట్సు...అంతేనా?"

"ముమ్మాటికీ అవి నీకు దెబ్బ కొట్టి ఉంటాయి"

"అదే నేను అడిగేది ఆ సిఆర్‌లు ఎందుకు దెబ్బకొట్టాలి. ఎందుకు చెడిపోవాలి? నేనేమన్నా పని దొంగనా? నాకు పని చేతకాదా?" సుబ్బారావు బాధ.

"చూడు సుబ్బారావు... నువ్వు ఒక స్థాయికి చేరుకున్నావు. ఈ స్థాయిలో నీ పనికంటే నువ్వు ఇతరులతో ఎలా పని చేయిస్తావు అని చూస్తారు. టీము లీడరుగా నీ క్రింది వారి ద్వారా ఫలితాలు ఎలా రాబడతావు అని చూస్తారు" అప్పారావు వివరించాడు.

"నిజమే... కానీ నా క్రిందివారిని సెలెక్టు చేసుకునే అధికారం నాకులేదు. వారిని నేను నియమించలేదు. పనికిరాని వాళ్లందర్నీ తెచ్చి నా కింద పడేస్తే వారితో నేను ఎలా వేగేది?" వాపోయాడు సుబ్బారావు అనే చిన్ని ఆఫీసరు.

"శిలలను శిల్పాలుగా చెక్కడంలోనే శిల్పి ప్రతిభ ఉంటుంది"

"కానీ ఏ శిలను శిల్పంగా మలచాలో నిర్ణయించుకునే అధికారం శిల్పికి ఉంటుంది. దేనికీ పనికిరాని రాయిని తెచ్చి శిల్పంగా చెక్కమంటే ఆ మయుడు కూడా ఏమీ చేయలేడు" అంటూ నిట్టూర్చాడు సుబ్బారావు.

"మరి నీ క్రింది వారికి కూడా రెగ్యులర్‌గా ప్రమోషన్లు వచ్చాయి. వారి సిఆర్లు రాసింది నువ్వేకదా. అంత పనికిరాని వాళ్లకు ఇంద్రుడు చంద్రుడు అని ఎందుకు రాశావు?" అప్పారావు లా పాయింటు కెలికాడు బయటకు.

"చూస్తూ చూస్తూ వారి పొట్టలు కొట్టలేక వాళ్లు చేసినా చేయకపోయినా బాగానే రాసాను" సుబ్బారావు నిట్టూర్చాడు.

"కానీ నీపై వాళ్లకి నీ అంత ఉదార హృదయం ఉండదు కదా. కొందరు కర్కోటకులు ఉంటారు. వారి చేతుల్ల పడి వుంటావు" ఓదార్చాడు అప్పారావు.

"అదే నేను అడిగేది. దేవుడంటూ ఉంటే అటువంటి వెధవల చేతుల్లోనే నేను ఎందుకు పడాలి? జీవితంలో ఇలా ఎన్నో ప్రమోషన్లు పోగొట్టుకుని ఎందుకు బాధపడాలి?" సుబ్బారావు మళ్ళీ మొదటికొచ్చాడు.

"సారీ నాకు అర్జంటు పని ఉంది... మర్చిపోయాను" అప్పారావుకు ఏదో గుర్తుకొచ్చి పరుగెట్టాడు. 'ఎప్పకపయి తిరుగువాడు ఎక్కుపర్తు సుమతి' అన్న సామెత ఉండనే ఉంది.

సుబ్బారావు ఇంటికొచ్చాడు రాత్రి ఎనిమిదింటికి.

మొహం వ్రేలాడేసుకుని కనిపించాడు కుమారరత్నం ఆనంద్.

"ఏరా ఆనంద్... నువ్వు చేసిన ఇంటర్‌వ్యూ ఏమైంది?" అడిగాడు.

"రాలేదు"

'అంటే?"

"నేను సెలెక్టు కాలేదు. మా ఫ్రెండ్స్ ఇద్దరయ్యారు" చెప్పాడు నిర్లిప్తంగా.

"అదేం నువ్వు బాగా చెప్పలేదా?"

"చెప్పాను. వాళ్లకు పర్సంటేజీ ఎక్కువొచ్చిందిట... అందుకని"

"అరె... ఇంటర్‌వ్యూ పెట్టినప్పుడు పర్సంటేజీతో పనేంటి? ఎవరు బాగా చెబితే వాళ్లకు ఉద్యోగం ఇవ్వాలి" సుబ్బారావు వాపోయాడు.

"కానీ ఆ ఇంటర్‌వ్యూ కమిటీలో నువ్వు లేవు కదా"

"నిన్నెవ్వరూ బాగు చేయలేరు. ఇంటర్‌వ్యూలకే వేలకు వేల రూపాయలు ఖర్చు అయిపోతున్నాయి. చదువుకు తగలేసిన లక్షలు కాక ఇదొక అదనపు ఖర్చులు" విసుక్కున్నాడు.

"అందుకే నేను స్టేట్స్‌కు పోతానన్నాను"

"డబ్బులు ఎక్కడనుంచి వస్తాయి. పది పది హేనులక్షలు కావాలి" గయ్యిమన్నాడు సుబ్బారావు. అది అతనికి తలకు మించిన భారం. పైగా కొడుకు దూరంగా వెళ్లడం ఇష్టపడడు.

"మరి నా ఫ్రెండ్స్‌లో చాలామంది అమెరికా వెళ్లిపోయారు. వాళ్ల పేరెంట్స్ కూడా నీలాగా ఆలోచిస్తే వాళ్లకు అంత మంచి భవిష్యత్తు దొరికేదా? లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు" తిరస్కారంగా అన్నాడు ఆనంద్.


సుబ్బారావు తల పట్టుకున్నాడు.

★★★

మరో రెండురోజుల తరువాత సుబ్బారావుకు ఇంకో షాక్ తగిలింది. ఎంతో ఆశలు పెట్టుకున్న సంబంధం వాళ్లు తిరస్కరిస్తూ జాబు రాసారు. మాధవి అతని కూతురు. ఎన్నో సంబంధాలు చూస్తున్నారు. చాలా సంబంధాలు కట్నం దగ్గర పోయాయి. కొందరు అమెరికాలో సెటిలవుతామంటే తానే తిరస్కరించాడు. కుదరక కుదరక ఓ రెండు సంవత్సరాల నిరీక్షణలో దాదాపు తాంబూలాలు పుచ్చుకునే స్థాయికి చేరుకుంది ఈ ఒంగోలు సంబంధం.

అబ్బాయి హైదరాబాద్‌లో మంచి కంపెనీలో రెండు చేతులా సంపాదిస్తున్నాడు. ఆస్తిపాస్తులు బాగానే ఉన్నాయి. వారిది చిన్న కుటుంబం, చింతలులేని కుటుంబం. ఆడబిడ్డ పోరుగానీ, అత్త పోరుగానీ లేదు. తండ్రి, ఇద్దరు మొగపిల్లలు. తమ్ముడు ఎక్కడో కర్ణాటకలో చదువు వెలగబెడుతున్నాడు. ఇంక గోవర్ధన్ ఒక్కడే హైదరాబాద్‌లో వుంటున్నాడు ఉద్యోగరీత్యా. వాళ్ల తండ్రి ఆస్తిపాస్తులు చూసుకుంటూ ఒంగోలులోనే వుంటున్నాడు.

కాబట్టి ఈ ఒంగోలు సంబంధంతో తమ గోలు నెరవేరుతుందనుకున్నాడు. అమ్మాయిని నాలుగుసార్లు చూసారు. ఒకసారి పెళ్లికొడుకు, ఇంకోసారి తండ్రితో, ఇంకోసారి వారి శ్రేయోభిలాషులతో, మరోసారి వారి దగ్గరి బంధువులతో... ఇలా చూడడమే కాకుండా తరచుగా సెల్లులో సొల్లు కబుర్లు, యస్సెమ్మెసుల ఇస్తున్నాడు పెళ్లికొడుకు.



ఇంక తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తాలు పెట్టుకోవాలనుకుంటున్నప్పుడు వచ్చింది ఆ వార్త.

గోవర్ధన్ నానమ్మ చనిపోయిందిట. అది వారికి అపశకునంలా తోచిందిట.

అమ్మాయి కాలు పెట్టకుండానే నిక్షేపంలా ఉన్న నానమ్మ పోయింది, ఇంక కాలు పెడితే ఎవరో పోతారోనని బంధువులంతా ఆడిపోసుకుంటున్నారుట. దాంతో ఈ సంబంధం వద్దని జాబు రాసారు.

సుబ్బారావుకు మతిపోయింది. అయినా నిరుత్సాహ పడకుండా కార్యశూరుడు కాబట్టి గోవర్ధన్‌ను వెతుక్కుంటూ వాళ్ల కంపెనీకి పోయాడు. అక్కడ రిసెప్షన్‌లో కూర్చుని కబురు చేసాడు. కాసేపటికి గోవర్ధన్ వచ్చాడు దొంగ చూపులు చూసుకుంటూ.

“ఏమిటి అంకుల్ ఇలా వచ్చారు?” నవ్వుతూ అడిగాడు గోవర్ధన్.

“అదేంటి బాబూ... కొండంత ఆశలు పెట్టుకున్నాం. అలా రాసారు” బాధగా, జాలిగా అడిగాడు సుబ్బారావు నమ్మలేనట్లు.

“రీజను కూడా రాసారుకదా” కళ్లు నేలకు వాలుస్తూ అన్నాడు.

“ముసలాళ్లు పోకుండా ఉంటారా? ఎప్పుడో ఒకప్పుడు పోయేవాళ్లేగా? అందుకు సంబంధం వదులుకుంటారా?” అన్నాడు సుబ్బారావు.

“నిజం చెప్పాలంటే నాకు పెళ్లికి తొందరలేదు. మా నాన్నమ్మ తొందర పడింది. తను బాబాయి దగ్గర ఉంటోంది. ఆమెకు మాధవి ఫోటో చూపించాము. బాగుంది చేసుకోమంది. కానీ నిక్షేపంలాంటి ఆమె నిద్రలోనే పోయింది ఆ మర్నాడు.

ఫోటో చూడంగానే పోయిందే... ఇంక పెళ్లయితే ఇంకేమవుతుందోనని మా బంధువులో గోల పెట్టారు. అందుకే సెంటిమెంటల్‌గా ఈ సంబంధం అచ్చి రాలేదని...” నాన్చాడు గోవర్ధన్.

“గోవర్ధన్! బాగా చదువుకున్నవాడివి. పెద్ద ఉద్యోగం చేస్తున్నవాడివి. నీకీ చాదస్తాలు ఏమిటి? దీన్ని కాకతాళీయం అంటారు. మూఢనమ్మకాలు మంచివి కావు. నువ్వు మాధవిని ఇష్టపడ్డావు. మాధవి కూడా నువ్వంటే బాగా ఇష్టపడింది. పైగా సెల్లులో ఎన్నోసార్లు మాట్లాడావు. మెసేజీలు కూడా పంపావు. అందుకని కాస్త ఆలోచించు.. ఇంత దూరం దూరం వచ్చింతర్వాత...” ప్రాధేయపడ్డాడు సుబ్బారావు.

“అదే నేను చేసిన తప్పు. తొందర పడకుండా ఉండాల్సింది. ఎలాగూ మాధవి కాబోయే భార్యే కదాని కొంత చనువు పెంచుకున్నాను. బట్ అనుకున్నామని జరగవు అన్నీ. మా నాన్నమ్మ పోకుండా ఉంటే నాకీ విషమ పరీక్ష తప్పేది” గోవర్ధన్ అన్నాడు.

“ఏది ఏమైనా ఇంకోసారి ఆలోచించు బాబూ... మీ ఇంట్లో ఒక సంవత్సరం దాకా పెళ్లి చేయకూడదు అనుకున్న మేము నీ కోసం ఆగుతాము” చెప్పాడు సుబ్బారావు.

“నో...నో. అంకుల్ వన్ ఇయర్‌లో ఎవరో ఎలా వుంటారో తెలియదు. మాధవికి మంచి సంబంధం చూసి చేయండి”

“మీ పెద్దవాళ్లను పక్కనపెట్టు. ఈ సంబంధం నీకిష్టమేనా?” అడిగాడు సుబ్బారావు అతన్ని నిలదీస్తున్నట్లు.

“ప్రతి మానవుడు కొన్ని బంధాల్లో చిక్కుకుని ఉంటాడు. సంబంధాల విషయంలో ఆ బంధాలు ప్రతిబంధకాలుగా మారుతూ ఉంటాయి. అయినా అంకుల్ మన చేతిలో ఏముంది? నేను వస్తాను?” వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు గోవర్ధన్.

సుబ్బారావు చాలాసేపు శిలాప్రతిమలా కూర్చుండిపోయాడు. ‘దేవుడుంటే ఎందుకిలా జరుగుతుంది?’ తనలో తాను ప్రశ్నించుకున్నాడు ఇంకొకసారి.

చాలాసేపు అలా దిగులుగా కూర్చున్న సుబ్బారావును చూసి రిసెప్షనిస్టుకు జాలి కలిగింది.

ఆమె అతని దగ్గరకు వచ్చి అడిగింది.

“సంబంధం కోసమేగా వచ్చింది. అతనికి ఆల్‌రెడీ ఫిక్స్ అయింది.”

“అవునమ్మా ఫిక్స్ అయింది. కానీ ఇప్పుడు కాదంటున్నాడు” బాధగా చెప్పాడు కళ్లద్దాలు తీసి జారుతున్న కన్నీళ్లను రుమాలుతో తుడుచుకుంటూ సుబ్బారావు.

“మీరు పరబ్రహ్మం కాదనుకుంటాను?” ఆమె అడిగింది తడబడుతూ.

“పరబ్రహ్మం ఎవరు? నేను సుబ్బారావును” చెప్పాడు.

“సారీ అతనికి ఫిక్సయింది పరబ్రహ్మంగారి అమ్మాయితో.”


“వాళ్లెవ్వరు? నేను కదా ముందు ఫిక్స్ చేసుకుంటున్నది.”

“ఆయన పెద్ద కోటీశ్వరుడు. ఈ ఊళ్లో పేరున్న క్రిమినల్ లాయర్. కట్నం ఓ కోటి ఎర చూపినట్టున్నాడు. అటువంటి వారిని వదులుకుని



## శిల్పాశెట్టి మౌనవ్రతం

శిల్పాశెట్టి తను ఇంతకాలంగా సినిమాల్లో బిజీగా వుంటూ తనని తను మర్చిపోయానని తెగ వాపోతోంది. తన ఆత్మతో తనకి అంతరంగంలో అనుబంధం ఏర్పడాలి చెన్నయ్‌లోని వన్‌నెస్ అనే సంస్థ వారి శిక్షణ కార్యక్రమానికి వెళ్లిందిట. వీళ్ల కోర్సులో భాగంగా మౌనవ్రతం పాటించాలిట. ఎక్కువగా మాట్లాడే అలవాటున్న శిల్పకి ఇలా మౌనాన్ని పాటించడం అంటే చాలా కష్టమే. కానీ తను ఇలా చేయడం వల్ల తనకెంతో మేలు జరుగుతుంది కాబట్టి కష్టపడి మరీ మౌనాన్ని పాటించినట్టు చెబుతోంది. ఈ కోర్సు చేసినప్పటి నుంచీ తనకి ఎంతో కొత్తగా, హాయిగా అనిపిస్తున్నట్టు శిల్ప చెబుతోంది.



మీలాంటి సామాన్యులతో సంబంధం కలుపుకోవడానికి గోవర్ధన్ తెలివితక్కువవాడు కాదు'' ఆమె చెప్పింది మందలిస్తున్నట్లుగా.

“మరి మా అమ్మాయిలో ఆశలు ఎందుకు రేపాడు?'' అర్థం కాక అడిగాడు.

“బహుశా వారు ఈమధ్యే అతన్ని వెతుక్కుంటూ వచ్చి ఉండవచ్చు. డైరెక్టుగా మొహంమీద చెప్పలేక ఏదో ఒక కారణం చూపించి ఉంటారు. అయినా ఇటువంటివి ఇతనికి అలవాటే. అంతకుముందు కూడా నలుగురైదుగురు మీలాగే వచ్చారు. ఇంత ఫికిల్ మైండున్న అబ్బాయితో మీ అమ్మాయి సుఖపడలేదు. ఇంకేదన్నా చూసుకోండి'' చెప్పింది ఆ రిసెప్షనిస్టు.

ఉసూరుమంటూ కాళ్లీడ్చుకుంటూ వచ్చాడు ఇంటికి సుబ్బారావు.

మాధవికి ఈ విషయం తెలిసి ఏడ్చింది, కోపం తెచ్చుకుంది. గోవర్ధన్‌కు ఫోన్ చేసింది. మెసేజ్ పంపింది. ఎన్నిసార్లు ప్రయత్నించినా రిప్లై ఒక్కటే... ‘చెక్ యువర్ నెంబర్’... సెల్ మారినట్టుంది.

సుబ్బారావు అపజయాలను చూసి ఆఫీసులో అందరూ చాటుగా నవ్వుకోసాగారు ‘గురుడు మొహాన అదృష్టం లేదు’ అంటూ.

‘దురదృష్టవంతులను వరుసగా నిలబెడితే ఇతను మొదటివాడు’

★★★

కాలం భారంగా గడుస్తున్నది.

ఆనంద్ అమెరికా వెళ్లలేకపోయాడు అనడంకంటే సుబ్బారావు పంపలేదు అనడం సబబు.

అందుకని ఓ చిన్న కంపెనీలో సెటిలైపోయాడు ఆనంద్. అమెరికాలోలా ఆకర్షణీయమైన జీతం రాకపోయినా భుక్తికి, స్టేటస్‌కు లోటులేదు. భవిష్యత్తులో మంచి మంచి అవకాశాలు వస్తాయిట.

అమెరికాలో బాగా సంపాదించుకుని అక్కడి వాతావరణంలో విసిగిపోయి తల్లిదండ్రుల వత్తిడితో ఇండియాకు వచ్చి సెటిలైపోదామనుకున్న ప్రశాంత్‌తో మాధవికి సంబంధం కుదిరింది. అతను అంత అందగాడు కాకపోయినా గుణవంతుడు. హైదరాబాద్‌లో ఫ్లాట్లు కొనుక్కుని స్థిరపడ్డాడు. తనే చిన్న కంపెనీ ప్రారంభించాడు. తొందరలోనే సుబ్బారావు తాత కాబోతున్నాడు.

★★★

సుబ్బారావు పని చేసుకుంటూ వుంటే అప్పారావు పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఆ రోజు పని ఉండి రాత్రి ఏడు అయినా ఆఫీసులోనే ఉన్నాడు తను.

“సుబ్బారావు! నీకీ విషయం తెల్సా?'' ఆయాసపడుతూ అడిగాడు అప్పారావు.

“ఏదీ నువ్వు చెప్పందే?'' సుబ్బారావు జోక్ కట్ చేసాడు.

“మన చంద్రశేఖరం, ముకుందం ఇకలేరు'' బాధగా అన్నాడు.

“అదేంటి... లాస్టియరేకదా వాళ్లకు ప్రమోషన్ వచ్చింది. ఇద్దర్ని నార్త్‌కు వేసారుగా ఒకే ఆఫీసుకు. రింగురంగా అంటూ ఇద్దరు చెట్టాపట్టాలేసుకుంటూ వెళ్లిపోయారు'' ఆశ్చర్యంగా ఆడిగాడు సుబ్బారావు.

“ఆ... అదే... వాళ్లిద్దరూ సాయంత్రం షికారుకని వెళ్లి ఛాట్ బండార్‌లో టిఫిన్ తింటూ ఉంటే ఎవరో తీవ్రవాదులు బాంబు పేల్చారుట. పాపం...మనవాళ్లిద్దరూ పోయారుట. టీవీలో ఫ్లాష్ న్యూస్'' అప్పారావు ఎంతో బాధపడుతూ చెప్పాడు.

సుబ్బారావుకు దిమ్మ తిరిగిపోయింది. ఒక్కసారి సుబ్బారావు గుండె ఆగి కొట్టుకోసాగింది.


ఒకవేళ తాను ప్రమోషన్ పొంది అక్కడకు వెళ్లి ఉంటే తన గతీ అంతేగా? తనని ఏదో ఒక అదృశ్య హస్తం ఈ గండం నుంచి కాపాడింది.

ఇంటికొచ్చిన సుబ్బారావుకు ఆనంద్ ఎదురుపడి ఓ వార్త చెప్పాడు.

“నాన్నా! మా ఫ్రెండ్స్‌కు అమెరికాలో ఉద్యోగాలు ఊడిపోయాయిట. ఆర్థిక మాంద్యంవలన దెబ్బ తిన్నారుట. ఇండియాలో జాబ్స్ చూసి పెట్టమని నాకు ఈమెయిల్స్ పంపారు...'' ఆనంద్ ఎంతో బాధగా చెబుతున్నాడు.

సుబ్బారావుకు అనిపించింది... దేవుడు కనిపించకపోయినా తప్పక ఉన్నాడని.

★



## కఠిన శిక్షణ

రష్యాలో ఇటీవల జరిగిన నేవీడే ఉత్సవాలకి ముందు సైనికులు ఎంతో కఠినమైన శిక్షణకి సంసిద్ధులైనారు. ఒక దిమ్మ మీద తలపెట్టి నిటారుగా పడుకున్న సైనికుడి కాళ్లను మరొకడు పట్టుకొనగా అతని కడుపు మీద ఇంకొకడు ఇటుకను సుత్తితో కొట్టి బద్దలు చేసినప్పుడు అతను కించిత్తయినా కదలలేదు,. అలాగే బూట్లు ధరించి ఆయుధాలతో ఒకడు వెల్లకిలా పడుకున్న సైనికుడిపై గెంతులు వేసినా అతను తొణకలేదు.

-తటవర్తి

